కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేత

కోల్‌సిటీ, ఆగస్టు 14: గంగానగర్ శివారులోని సర్వే నంబర్ 36, 37, 38లోని పదెకరాల్లో రెండేళ్ల క్రితం నిర్మించిన అక్రమ నిర్మాణాల కూల్చివేత రెండో రోజు కూడా కొనసాగింది. దాదాపు 350 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకోగా, అందులో బుధవారం వరకు 127 ఇండ్లను కూల్చివేశారు. బాధితులంతా స్వచ్ఛందంగా సహకరించి ఇండ్ల తొలగింపునకు సహకరించడంతో కూల్చివేతల పర్వం ప్రశాంతంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా సంఘటన స్థలంలో సీపీఎం పార్టీ నాయకుడు వై యాకయ్య విలేకరులతో మాట్లాడారు. నిరుడు సీపీఎం పార్టీ పోరాటం ఫలితంగానే గూడు లేని నిరుపేదలకు ఇక్కడ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం కాలనీగా నామకరణం చేశామని, బాధితుల పక్షాన కమిటీ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కాలనీ అభివృద్ధి ఆకాంక్షించి రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, బోర్లు ఇతర మౌలిక సదుపాయాల కోసం ఇండ్లు నిర్మించుకున్న వారి నుంచి విరాళాలు సేకరించామన్నారు. బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన చరిత్ర సీపీఎం పార్టీది కాదన్నారు.ఆరోపణలు అవాస్తవమన్నారు. ఇండ్లు కోల్పోయిన బాధితులకు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు, అధికారులు మరో చోట ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు స్థలం కేటాయిస్తామని హామీ ఇవ్వడంతోనే ఈ తొలగింపునకు తాము సహకరించామన్నా రు. రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్టీపీ నిర్మాణం చేపడుతున్నందు నే ఇండ్ల కూల్చివేతకు అధికారులకు సహకరించామన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ నిర్మాణం కోసం ఆ స్థలాన్ని స్వాధీన చేసుకుంటున్నం
సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్

ప్రభుత్వ ఖాళీ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్నం. ఎస్టీపీ నిర్మాణానికి ఆ స్థలా స్వాధీనం చేసుకుంటున్నం. ప్లాంట్ ఏర్పాటుకు అదే అనువైన స్థలంగా గుర్తించిన తర్వాతే అక్కడ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నాం. బాధితులకు భవిష్యత్‌లో ప్రభుత్వం పేదలకు ఇండ్లను మంజూరుకు ప్రవేశపెట్టే పథకంలో ప్రాధాన్యత కల్పిస్తాం.

ఘన్‌శ్యామ్‌దాస్ నగర్‌లో ..

పాలకుర్తి, ఆగస్టు14: పాలకుర్తి మండలం గన్‌శ్యాందాస్‌నగర్ పంచాయ తీ పరిదిలోని సర్వేనంబర్ 561లో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను బుదవారం తహసీల్దార్ జ్యోతి కూల్చి వేయించారు. రాత్రికి రాత్రే రేకుల షెడ్ల నిర్మాణం జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు, పరిశీలించి, కలెక్టర్ ఆదేశాలప్రకారం కూల్చివేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కాగ తమకు పూర్తిగా పట్టాపాసుబుక్కులు ఉన్నాయని, సాంకేతిక సమస్యలతో ధరణి పాసుబుక్కులు రాలేదని, బాదితులు పేర్కొన్నారు. కావలని జిల్లా అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి తమ కట్టడాలను కూల్చివేస్తున్నారని బాదితులు ఆవేదన వ్యక్తంచేశారు.

రెండు దశాబ్దాల పోరాటం ఫలించింది

- బీపీఎల్ నిర్వాసితుల నిరీక్షణకు తెర
- పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయంలో చరాస్తుల జప్తునకు తాజాగా కోర్టు ఆదేశాలు
- ఈ నెల 20లోగా పరిహారాన్ని జమ చేయాలని హుకూం
- 19న జమ చేస్తామని కోర్టు బెయిలీఫ్‌కు రాతపూర్వకంగా ఇచ్చిన ఆర్డీఓ

ఆర్డీవో కార్యాలయం

పెద్దపల్లి, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): రామగుండం మండలం బీపీఎల్ భూనిర్వాసితుల 20ఏళ్ల న్యాయ పోరాటం ఫలిస్తున్నది. కోర్టు తీర్పుతో పరిహారం కోసం రెండు దశాబ్దాల ఎదురుచూపులకు తెర పడుతున్నది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని విద్యుత్ అవసరాలను తీర్చే లక్ష్యంతో బొగ్గు, జల వనరులు పుష్కలంగా ఉన్న రామగుండంలో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ఆనాటి సమైక్య ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పనులు దక్కించుకున్న బ్రిటీష్ పవర్ లిమిటెడ్(బీపీఎల్) కంపెనీ కోసం అప్పటి చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం రామగుండం మండలం బ్రాహ్మణపల్లి, మల్యాల్‌పల్లి, కుందన్‌పల్లి, రాయదండి శివారుల్లోని దాదాపు 900మంది రైతుల నుంచి 1200 ఎకరాలు సేకరించింది. ఖుష్కీకి(డ్రై ల్యాండ్) ఎకరానికి రూ.16 వేల నుంచి రూ.22వేలు, తరీకి ఎకరానికి రూ.32 వేల నుంచి రూ.42వేలుగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే తమకు సరైన ధర చెల్లించడం లేదంటూ 36మంది రైతులు 2004లో పెద్దపల్లి సబ్ కోర్టును ఆశ్రయించగా, ఖుష్కీకి రూ.90వేలు, తరీ రూ.95వేలు ఇవ్వాలని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2005లో తీర్పు చెప్పింది. కానీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా పరిహారాన్ని పెంచవద్దని హైకోర్టును ఆశ్రయించగా, అక్కడా చుక్కెదురైంది. పెరిగిన డబ్బులలో 50శాతాన్ని రెండు నెలల్లో ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినా, ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అయితే హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా రావడంతో ధర తగ్గింపు కోసం బీపీఎల్ సంస్థ నుంచి న్యాయవాదులను పెట్టుకొని కేసును పెద్దపల్లి కోర్టుకు రిమాండ్ చేయాలని కోరగా, ఈ కేసు తిరిగి పెద్దపల్లి సబ్‌కోర్టుకు వచ్చింది. ఆ తర్వాత జరిగిన పలు పరిణామాల అనంతరం పలుమార్లు నిర్వాసితులకు అనుకూలంగా కోర్టులు తీర్పు ఇచ్చినా చెల్లింపులు జరుగలేదు. గత జూలై 2న పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయానికి ఉన్న చరాస్తులను జప్తు చేయాలని గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జ్ బీ. శ్రీనివాసులు తీర్పు వెలువరించారు. ఈ మేరకు ఆగస్టు 20లోగా నిర్వాసితులకు డబ్బులు ఈపీలో జమ చేయాలని పెద్దపల్లి ఆర్డీఓను ఆదేశాలు ఇవ్వడంతోపాటు ఆస్తులు జప్తు చేసేందుకు బుధవారం కోర్టు బెయిలీఫ్ శంకరయ్య పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో ఏఓను కలిసి నోటీసులు అందజేశారు. వెంటనే స్పందించిన ఆర్డీవో ఈ నెల 19లోగా చెల్లింపులు చేస్తామని కోర్టు బెయిలీఫ్‌కు చెప్పడంతో వారు వెనుదిరిగారు.

న్యాయం గెలిచింది..

బీపీఎల్ కంపెనీ ఏర్పాటు కోసం తమ పట్టా భూములను ఇచ్చి, పరిహారం కోసం 24ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిర్వాసితుల పోరాటం ఫలించింది. న్యాయం గెలిచింది. 2005లోనే కోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడంతో రెవెన్యూ అధికారులు చొరవ చూపలేదు. దీని వల్లే చరాస్తుల జప్తుకు కోర్టు ఆదేశించింది. ఈ నెల 20వ తేదీలోగా చెల్లింపులు చేయాలని తీర్పు చెప్పడంతో 19వ తేదీనే చెల్లింపులు చేస్తామని పెద్దపల్లి ఆర్డీఓ ముందుకు వచ్చారు. నిర్వాసితులకు చెల్లింపులు జరగాలి.

- మందల విక్రం రెడ్డి, భూనిర్వాసితుల తరపు న్యాయవాది కరీంనగర్.

నాకు పదకొండున్న ఎకరాలకు పరిహారం రావాలే

బ్రాహ్మణపల్లి శివారులోని పదకొండున్నర ఎకరాల భూమి బీపీఎల్ కంపనీ కోసమని తీసుకున్నారు. కంపెనీ పెట్టింది లేదు. మాకు నౌకర్లు, ఉపాధి దొరికిందీ లేదు. 24 ఏండ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. అప్పటి నుంచి పంటలు నష్టపోయినం. రైతు బంధు నష్టపోయినం. ఆ భూములు మా పొంటినే ఉంటే మస్తుండు. మమ్ముల ఎటుకాకుంట చేసిన్లు. పరిహారం ఇవ్వడం లేదు. ఇయ్యాల ఆర్డీఓ ఆఫీస్‌నే సీజ్ చేస్తరన్నవోలె కొంచెం కదలిక వచ్చింది.

- దుర్గం చంద్రయ్య, నిర్వాసిత రైతు, బ్రాహ్మణపల్లి, రామగుండం మండలం

సెలైన్ వికటించి విద్యార్థిని మృతి

- రంగయ్యపల్లిలో విషాదం

ప్రసన్న(ఫైల్)

ముత్తారం, ఆగస్టు 14: సెలైన్ వికటించి బాలిక మృతిచెందిన ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలోని రంగయ్యపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెంది న సోమిశెట్టి నారాయణ, లక్ష్మీల కూతురు ప్రసన్న (17) పెద్దపల్లి ట్రినీటి కాలేజీలో డిప్లమా ఫసియర్ చదువుతున్నది. మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో ఖమ్మంపల్లిలోని ఆర్‌ఎంపీ వద్ద కు తీసుకెళ్లడంతో సెలైన్ పెట్టాడు. ఆ బాటిళ్లో ఇంజెక్షన్ వేశాడు. అయితే సెలైన్ పూర్తి కాకముందే ప్రసన్న అపస్మారక స్థితిలోకి వెళ్లగా, సదరు ఆర్‌ఎంపీ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించడం తో మొదటగా మంథని, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. అయితే విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం, ప్రస న్న మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్తుండగా మంథనిలో పోలీసులు అడ్డుకున్నారు. పోస్టుమార్టం చేయించాలని సూచించడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు వాగ్వాదం జరిగింది. అనంతరం మృతదేహాన్ని మంథని దవాఖానలోని మార్చురీకి తరలించారు. కాగా, తన కూతురు మృతికి ఆర్ఎంపీనే కారణమని తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జీ-3 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే

రామగిరి, ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా సింగరేణి ఆర్జీ-3 ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న అబ్దుల్ రజాక్, అడ్రియాల నుంచి ఫోర్‌మెన్ బానోతు కార్తిక్ ఉత్తమ సింగరేణియన్లుగా ఎంపికయ్యారు. కొత్తగూడెంలో జరిగే సింగరేణి ప్రధాన వేడుకల్లో సీఎండీ బలరాం సన్మానం చేయనున్నారు. ఆర్జీ-3 కార్యాలయంలో జరిగే వేడుకల్లో ఓసీపీ-1 నుంచి రాజాహరి, దేవ వెంకటరెడ్డి, ఓసీపీ-2 నుంచి తిరుపతి, కనకయ్య, ఏఎల్‌పీ గని నుంచి కుమారస్వామి, సయ్యద్ దస్తగిరి, సీహెచ్‌పీ నుంచి దొడ్ల శ్రీనివాస్‌లు ఎంపిక కాగా, వీరిని జీఎంలు సుధాకర్ రావు, వెంకటేశ్వర్లు చేతుల మీదుగా జ్ఞాపికలతో సన్మానించనున్నట్లు పర్సనల్ అధికారి శ్రీహరి తెలిపారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు, టై, బెల్టుల వితరణ

ధర్మారం,ఆగస్టు14: పత్తిపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కాల్వశ్రీరాంపూర్ వేదపాఠశాల హెచ్‌ఎం తిప్పర్తి సత్యాచార్య ఐడీ కార్డులు, టై, బెల్టులు బుధవారం విరాళంగా అందజేశారు. జడ్పీ కాంప్లెక్స్ హెచ్‌ఎం కేపీ నరేందర్ రావు, ప్రైమరి స్కూల్ హెచ్‌ఎం నూతి మల్లయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, శారద, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మంథని,ఆగస్టు14: వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసే దిశగా అధికారులు శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ జీ వీ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆదేశించారు. మంథని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. జాతీయ రహదారి కోసం చేపట్టాల్సిన, భూసేకరణ, పెండింగ్ ధరణి సమస్యలు, వివిధ సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మండలంలో వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి సంబంధిత సర్టిఫికెట్లు జారీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం మహోత్సవంలో భాగంగా తహసీల కార్యాలయ ప్రాంగణంలో వన అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, డీఈ గిరి, సంతోష్ సింగ్ ఠాకూర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

పెద్దపల్లి, ఆగస్టు 14: బర్మా , శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. 30 ఏళ్లుగా అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు, వీవింగ్ మిల్లు మూత పడ్డాక వారి సమస్యలు, వారికి రావాల్సిన బకాయిల గురించి చర్చిం చి పలు సూచనలు చేశారు. ఆర్డీవో పెద్దపల్లి గంగయ్య, తహసీల్దార్ అంతర్గాం రమేష్, సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ కరీంనగర్ ఎస్. చరణ్, డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్, సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ ఎస్. చరణ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత, చేనేత జౌళి శాఖ అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్ , ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తానయ్యలు పాల్గొన్నారు.

గురుకులాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దపల్లి, ఆగస్టు14: జిల్లాలోని రెసిడెన్షియల్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని సంక్షేమ హాస్టల్, రెసిడెన్షియల్ గురుకులాల, కేజీబీవీ నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిళ్లతో సమీక్ష జరిపారు. పారిశుద్య నిర్వహణ, విద్యార్థులకు అందించే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్య నిర్వహణ నిరంతర ప్రక్రియగా ఉండాలని, వర్షాకాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాని సూచించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి ,జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నాగలేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ముత్తారం, ఆగస్టు 14: ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వినియోగించుకొని ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. మైదంబండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అడవి శ్రీరాంపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులలో విద్యాబోధనను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్‌ఎస్ ప్రహరీ గోడ మరమ్మత్తులకు అవసరమైన అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అడవి శ్రీరాంపూర్ జడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో గాజులపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి రాజయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు వితరణ చేసిన టీ షర్టులను విద్యార్థులకు అందజేశారు. ముత్తారంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద శ్రీ రాజమాత గ్రామ సంఘం ఆర్థిక సహయంతో ఏర్పాటు చేసిన శ్రీయాన్ మిల్క్ పార్లర్ ను ఆయన ప్రారంభించారు. ఖమ్మంపల్లి గ్రామంలో ఇటీవలప్రారంభించిన ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఇక్కడ డీఆర్డీవో రవీందర్ రాథోడ్, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, తహశీల్దార్ సుమన్ , ఎంపీడీవో జి.లలిత, మండల పంచాయతీ అధికారి బి కిరణ్ , పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.వరలక్ష్మి, ఎడిఎం పద్మ పాల్గొన్నారు.

బల్దియాలో ఆగని ఇంధన కుంభకోణం

కోల్‌సిటీ, ఆగస్టు 14: రామగుండం నగర పాలక సంస్థలో ఇంధన కుంభకోణం ఆగడం లేదని, అధికార పార్టీ కార్పొరేటర్ల వాహనాల్లో యథేచ్ఛగా డీజిల్, పెట్రోలు ఉచితంగా పోయడం వల్లనే అక్రమాలకు అడ్డుచెప్పడం లేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్ ఆరోపించారు. బుధవారం పారిశుద్య విభాగంలోని వాహనాలు విధుల్లో ఉండగా, జీఎం కాలనీ వద్ద డీజిల్ అయిపోయి ట్రాక్టర్ నడిరోడ్డుపైనే ఆగిపోయిందన్నారు. దీనితో సదరు డ్రైవర్ డీజిల్ కోసం కాజిపల్లికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. ఈ డీజిల్ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని రూరల్, ఆగస్టు 14: సూరయ్యపల్లిలో ఆకుల లక్ష్మి మరణించగా ఆమె పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం సందర్శించి నివాలులు అర్పించారు. అదే విధంగా వేల్పుల మధునయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఏగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, దేవళ్ల విజయ్ కుమార్‌లు ఉన్నారు.

కన్నాల విద్యార్థులకు టీ షర్ట్స్, డ్రమ్స్ పంపిణీ..

మంథని రూరల్,ఆగస్టు 14: కన్నాల జడ్పీ విద్యార్థులకు టీషర్ట్స్, డ్రమ్స్ పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ఆవరణలో కావట భూమయ్య కుమార్తె బోయిని స్వరూప సమ్మయ్య(సింగపూర్)లు తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు టీషర్ట్స్‌లను పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు పెండ్రు సమంత్ రెడ్డి, గుడిసె కేవల్, ఉడుత శ్రీనివాస్, బుదారపు సతీశ్ ఆధ్వర్యంలో డ్రమ్స్‌ను పాఠశాలకు వితరణ చేశారు. హెచ్‌ఎం హరి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, కావటి సందీప్, దొమ్మటి రవి, పాయిల రాజయ్య,ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఏపీ రాజు, రాధిక, సావిత్రి, శ్రీలత పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14: నిట్టూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు జోగుల శారద(30) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తూ దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి . గ్రామానికి చెందిన జోగుల చంద్రయ్య-మాధవి దంపతులకు కుమారులు వెంకటేశ్, అజయ్, కుమార్తె శారద ఉన్నారు. చంద్రయ్య దివ్యాం గుడు. భార్య మాధవి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులకు పెళ్లిళ్లు చేశారు. మానసిక, శారీరక వికలాంగురాలైన శారద, భర్త చంద్రయ్యలకు సపర్యలు మాధవి చూసుకుంటూనే జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శారద బుధవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలుసుకున్న తండ్రి చంద్రయ్య, సోదరులు వెంకటేష్, అజయ్‌లు అనుమానాస్పద మృతిగా పేర్కొనడంతో పెద్దపల్లి సీఐలు ప్రవీణ్‌కుమా ర్, అనిల్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ రావు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి శారద మృత దేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించారు. మృతురాలి కటుంబసభ్యుల ఫిర్యాదు, ఆరోపణల మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇద్దరు విద్యార్థులు.. ఒక టీచర్

- అడవిశ్రీరాంపూర్ ప్రైమరీ స్కూల్‌లో చిత్రం


పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

ముత్తారం, ఆగస్టు 14: అడవిశ్రీరాంపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులే ఉన్నారు. ఒకరు మూడో తరగతి, మరొకరు ఒకటో తరగతి చదువుతున్నారు. ఈ ఇద్దరు విద్యార్థులకు ఒక టీచర్ బోధిస్తున్నాడు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వంట మనిషి సైతం ఉన్నారు. మూడేండ్ల నుంచి ఈ పాఠశాలలో పదికి మించి విద్యార్థులు ఉండడం లేదు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు డిప్యుటేషన్‌పై పనిచేసేవారు. ఇటీవలి బదిలీల్లో ఇద్దరు టీచర్లను ట్రాన్స్‌ఫర్ చేయగా, మరొకరిని కొత్తగా నియమించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఈ పాఠశాలకు ₹4లక్షలు మంజూరు చేశారు. సర్కారు బడిలో సకల వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ఉపాధ్యాయుడు సతీశ్ కోరారు.

బాధ్యతల స్వీకరణ

రామగిరి, ఆగస్టు 14 : ఆర్జీ - 3 సేఫ్టీ అధికారిగా జే రాజశేఖర్ బుధవారం ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర రావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. ఆయన భూపాలపల్లి ఏరియా లోని కె.టి.కె-1 గ్రూప్ ఏ.ఓ గా పనిచేసి సేఫ్టీ అధికారి గా బదిలీ పై వచ్చినట్లు తెలిపారు.

14 మందిపై కేసునమోదు

పాలకుర్తి, ఆగస్టు14: జయ్యారం గ్రామశివారులోని అంకంమెట్టు గుట్ట వద్ద డబ్బులతో చిత్తుబొత్తు ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్.ఐ.స్వామి తెలిపారు. వారి నుంచి రూ.75,800 నగదు, 14 సెల్‌ఫోన్లు, 6 మోటార్ బైక్‌లు స్వాధీన చేసుకున్నట్లు ఎస్ఐ. తెలిపారు.

20న బీసీ సదస్సు

మంథని, ఆగస్టు14: ఈనెల 20న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని బీసీ నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని మహత్మ జ్యోతి రావు పూలే విగ్రహం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించే విధంగా బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 20న పెద్దపల్లి ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలన్నారు. పుప్పాల తిరుపతి, పుట్ట రామన్న, కండె రమేష్, సత్యనారాయణ, శంకర్‌లాల్, ఆరెపెల్లి కుమార్,ఆసీఫ్, ఇర్ఫాన్‌లతో పాటు పలువురు ఉన్నారు.

3.31 లక్షల జీవాలకు టీకాలు

రామగిరి, ఆగస్టు 14 : జిల్లాలో ఇప్పటి వరకు 3.31 లక్షల గొర్రెల టకు, మేకలకు నీలి నాలుక వ్యాధి టీకాలు వేశామని జిల్లా పశు వైద్యాధికారి శంకర్ తెలిపారు. బేగంపేటలోని మండల పశువైద్యా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల పశు వైద్యాధికారి దుర్గాప్రసాద్, లైవ్ స్టాక్ ఆఫీసర్ నారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

రామగిరి,ఆగస్టు 14: టీబీజీకేఎస్ నాయకుడు గౌతం శంకరయ్య తల్లి అమృతమ్మ ఇటివల మృతి చెందగా బుధవారం సెంటినరీకాలనీలో ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ బీ వెంకట్రావ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బీ. శంకర్ నాయక్, పర్స బక్కయ్య, జక్కుల దామోదర్, కాసు అనీల్, సతీష్ రెడ్డి, ఖాజా రహంతుల్లా భాస్కర్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

జ్యోతినగర్, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రామగుండం ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ యూనిట్ సిబ్బంది బుధవారం ఎన్టీపీసీలో జాతీయ జెండాలతో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ మీదుగా మేడిపల్లి సెంటర్ నుంచి ఎన్టీపీసీ టౌన్‌షిప్ వరకు కొనసాగింది. సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాడెంట్ ముఖేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

శాసన మండలి చైర్మన్‌కు స్వాగతం



ర్యాలీ తీస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 14 :తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ పెద్దపల్లి మీదుగా ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగే స్వతంత్ర వేడుక ల్లో పాల్గొనడానికి వెళ్తున్న నేపథ్యంలో బుధవారం రాత్రి పెద్దపల్లి ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పెద్దపల్లి నాయకులను కలిసేందుకు ఆగారు. బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బండ ప్రకాశ్‌కు ఘన స్వాగతం పలికి సత్కరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్, ప్రేమ్ కుమార్, నటరాజ్, లవణ్‌కుమార్, లక్ష్మన్‌కుమార్, శ్రీధర్‌పటేల్, శ్రీనివాసు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ ఎస్సైగా ప్రసాద్

కమాన్‌పూర్,ఆగస్టు 14: కమాన్‌పూర్ ఎస్సైగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ చంద్రశేఖర్ వీఆర్ రామగుండం కమిషనరేట్‌కు బదిలి అయ్యారు. భూపాలపల్లి ఎస్ఐ ప్రసాద్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 14: ఆగస్టు 15న నిర్వహించనున్న వేడుకలకు జిల్లా పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ఆ దిశగా జిల్లా అధికారు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. స్వతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరణకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద హాజరై పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు.

డిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా నుంచి ముగ్గురికి ఆహ్వానం


మహ్మద్ అల్ రిషన్


పర్శ అభిజ్ఞ

పెద్దపల్లి రూరల్,/ ఓదెల ఆగస్టు 14: డిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు పెద్దపల్లి జిల్లా నుంచి ముగ్గురికి ఆహ్వానం అందింది. ఓదెల మండల తెలంగాణ మోడల్ స్కూల్ నుంచి ఎస్కార్ట్ టీచర్‌గా సుజాత, 10 వతరగతి విద్యార్థిని పర్శ అభిజ్ఞ, పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ అల్‌రిషన్‌లకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్నందుకు డిల్లీ నుంచి ఆహ్వానం అందగా వారు బయలు దేరి వెళ్లారు. పెద్దపల్లి జిల్లా నుంచి వేడుకలకు వెళ్తున్న వీరిని ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జీఎంకు సన్మానం

గోదావరిఖని, ఆగస్టు 14:ఆర్జీ-1 జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జీఎం డీ లలిత్‌కుమార్‌ను బుధవారం ఆర్జీ-1 ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇక్కడ చీఫ్ కోఆర్డినేటర్ , పర్సనల్ కిరణ్‌బాబు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యదర్శి బంగారు సారంగపాణి, సూపర్‌వైజర్ రమేష్, శ్రావణ్‌కుమార్, వీరారెడ్డి, సంతోష్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED | HEALTH CARE | REAL ESTATE | TO-LET | EDUCATION

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

★**కరీంనగర్ ఉమ్మడి జిల్లా** ప్రజలకు, మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. HTR **కిసాన్ అగ్రిమాల్**, వెంకట్రావుపల్లి, మం|| బోయినపల్లి, జి|| రాజన్న సిరిసిల్ల. సెల్: 9866115064.
NTK-000

PLOT FOR SALE



★**కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి** DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

CHANGE OF NAME

★**I Silam Bhagya Laxmi**, R/o. 2-1-39, Jagtial, TG, Have changed my name as **SHEELAM BHAGYAMMA W/o. SHEELAM GANGARAM.**
TTK-0000

★**I, Silam Gangadhar**, R/o. 2-4-69, Jagtial, TG, Have changed my name as **SHEELAM GANGADHAR S/o. SHEELAM GANGARAM.**
TTK-0000

★**I, Silam Jamuna**, R/o. 2-4-69, Jagtial, TG, Have changed my name as **SHEELAM JAMUNA W/o. GANGADHAR.**
TTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189